## రాంచరణ్‌కు ప్రతిభ అవార్డు

కీసర: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10/10 ఉత్తీర్ణత సాధించిన రాంచరణ్ విద్యార్థితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని రవీంద్రభారతీలో జరిగిన ప్రతిభ అవార్డు ప్రధానోత్సవంలో కీసర జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రాంచరణ్‌తో పాటు ప్రధానోపాధ్యాయురాలు వేదవతికి అవార్డు అందజేశారు.

## ఘన సన్మానం



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలను సన్మానిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బాలేశ్ తదితరులు

ఘట్‌కేసర్: కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కుమార్‌ను ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సీనియర్ నాయకుడు బాలేశ్ తదితరులు సోమవారం కలిశారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. కేంద్ర సహాయ మంత్రి పదవి వచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. అలాగే ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేసిన ఈటల రాజేందర్, రఘునందన్‌రావును కలిసి శాలువాతో సత్కరించారు.

## నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఆరు దరఖాస్తులు

కీసర: నాగారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించి ఆరు దరఖాస్తులను స్వీకరించామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రజావాణిలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేనేజర్ మల్లారెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజావాణిలో ఏడు దరఖాస్తులు



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించి ఏడు దరఖాస్తులను స్వీకరించామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రాజమల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. డీఈఈ చిరంజీవులు, మేనేజర్ ఏ.వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బొమ్మరాశిపేటలో ప్రచారం చేస్తున్న సభ్యులు

శామీర్‌పేట్: త్రైత సిద్ధాంతం – ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు గిరి, సభ్యులు శ్రీనివాసచారి, జనార్దన్‌రావు, అమరేందర్, ప్రతాప్, విజయ, చిత్రభాను, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## 18న జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నిర్వహణకు సోమవారం డీసీఓ లింగాచారి, మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13న నామినేషన్ల స్వీరణ, పరిశీలన, ఉపసంహరణ ఉంటుందన్నారు. తదుపరి 18న పోలింగ్, ఫలితాలు వెల్లడి ఉంటుందన్నారు. ఎన్నికల కార్యక్రమాన్ని అంతా జిల్లాలోని మేడ్చల్ మండల కేంద్రంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## నూతన కమిటీ ఎన్నిక

రసూల్‌పురా: సికింద్రాబాద్ టివోలి రోడ్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం ఇండియన్ స్కౌట్, గైడ్స్ ఫెలోషిప్ రెండో ప్రత్యేక అసెంబ్లీ సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీఆర్ సిద్ధాంతి కళాశాలల వ్యవస్థాపకులు పీఎల్. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రసిడెంట్‌గా మక్‌మెక్కి, నేషనల్ కౌన్సిల్ సభ్యురాలు వాణి, రాష్ట్ర అధ్యక్షుడు మలయాద్రి, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షురాలిగా అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ వనజ, కోశాధికారిగా బీఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శి జూహి, జనరల్ సెక్రెటరిగా సీమ రాథి, జాయింట్ సెక్రటరిగా థెరిస్సానియమితులయ్యారు.

# ఎదురు చూపులు..

- జీపీ కార్మికులకు 3 నుంచి 7 నెలలుగా జీతాలు రాక..
- పస్తులుంటున్న కార్మిక కుటుంబాలు
- ప్రతినెలా చెల్లించాల్సిన వేతనాలు రూ.4.06కోట్లు




సాక్షి, మేడ్చల్ జిల్లా: పంచాయతీ కార్మికులకు నెల నెలా జీతాలు అందకపోవడంతో అర్ధాకలితో జీవితాలను వెల్లదీస్తున్నారు. ప్రతిరోజూ పంచాయతీ కార్మికులు పనిలోకి వస్తేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. ఒక్కరోజు కార్మికులు పనిచేయకపోతే గ్రామాల్లోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోతాయి. ఇంటి ముందు చెత్త ఉందని ఆగ్రహం వ్యక్తం చేసే ప్రజలు ముక్కు మూసుకుంటారు. ఉదయాన్నే గ్రామాల్లోని వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పని ప్రారంభించే పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడంతో పాటు నెలనెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అలాగే, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం వారు అందజేశారు.

**3 నుంచి 7 నెలల జీతాలు అందక అవస్థలు..**

మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో పంచాయతీ కార్మికులకు 3 నుంచి 7 నెలలుగా జీతాలందక ఇబ్బందులు పడుతున్నారు. లింగాపూర్ తండా, కేశ్వాపూర్, బండమాధారం, పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 8 నెలలుగా జీతాలు రాక పోగా, అవుశాపూర్‌లో 7 నెలలు, లక్ష్మాపూర్‌లో 4 నెలలు, ఉద్దమర్రి, మజీద్‌పూర్‌ల్లో 3 నెలలు, శ్రీరంగవరంలో 4 నెలలు, బొమ్మరాశిపేటలో 2 నెలల నుంచి కార్మికులకు జీతాలు అందని పరిస్థితి నెలకొని ఉంది.

**నగర శివారుల్లో 619 జీపీలు**

నగర శివారు మేడ్చల్– మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 619 గ్రామ పంచాయతీల్లో 4,779 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.8,500 చొప్పున రూ.4.06 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4,002 మంది కార్మికులు పని చేస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, 777 మంది కార్మికులు పని చేస్తున్నారు. పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

**స్పెషల్ ఆఫీసర్ల పాలనలో..**

జీపీ పాలకవర్గం గడువు ఫిబ్రవరితో ముగియడంతో అప్పటి నుంచి గ్రామ పంచాయతీలన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. తమ శాఖల్లోని విధుల నిర్వహణతో పాటు అదనపు పని భారంతో స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ ఆలనా పాలనా చూడలేకపోతున్నారు. దీంతో జీపీ కార్మికులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు నెలనెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కావడం లేదని తెలుస్తోంది.

### కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలల జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి 7 నెలలగా జీతాలు ఇవ్వకపోతే, వారి కుటుంబాల పరిస్థితి ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించడంతో పాటు వారికి అందజేయాల్సిన సుబ్బులు, నూనె, చెప్పులు, బట్టలను వెంటనే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సమ్మె చేస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి యూనియన్ జిల్లా నేతలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు ముత్యాలుబాబు, లక్ష్మయ్య, నరసింహ, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

90 అర్జీలను స్వీకరించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీలను త్వరగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లాకు చెందిల వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారం, పెండెన్సీపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఉన్న ప్రగతిని ఫిర్యాదుదారులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజావాణిలో 90 మంది నుంచి అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథపై సమగ్ర సర్వే

కీసర: మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీఓ గ్యామ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ పథకంపై గ్రామాల్లో సర్వే నిమిత్తం గ్రామ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్లకు తదితర సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించినట్లు చెప్పారు. సర్వే చేసే విధానం, యాప్‌లో వివరాలు ఏవిధంగా నమోదు చేయాలన్న అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సర్వేలో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ నల్లా కనెక్షన్ ఉందా లేదా? తాగునీటి సరఫరా ఎలా ఉంది అనే అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని తమ సిబ్బంది యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీఓ సురేష్, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల అవకతవకలపై విచారణ జరపాలి

ఏఐవైఎఫ్ జిల్లా సమితి ధర్నా




సాక్షి, మేడ్చల్ జిల్లా: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని ఏఐవైఎఫ్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. దీనికి బాధ్యులైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరింది. ఈ మేరకు సోమవారం ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, యువజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4న నీట్ 2024 ఫలితాలను ప్రకటించిందని, ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులు 720 మార్కులకుగానూ 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా నాయకులు శేఖర్, రమ్య, భవిత, మధురిమ, కీర్తన, భారత్, నగేష్, విద్య పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని, సమస్యల పరిష్కారానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌కు వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ కోరారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్, సీబీఎస్సీ సంస్థలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నా.. విద్యాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు పర్మిషన్ తీసుకొని 8, 9, 10వ తరగతులు నిర్వహిస్తున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఏవిధమైన రక్షణ చర్యలు తీసుకోకుండా పాఠశాలలను అపార్టుమెంట్లు, డబుల్ బెడ్ రూమ్ భవనాల్లో నడుపుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు టి.అరుణ్, అవినాష్, సాయి పాల్గొన్నారు.

## ఇద్దరు చిన్నారుల అదృశ్యం



చిన్నారులు(ఫైల్)

మేడ్చల్‌రూరల్: అనాథాశ్రమం నుంచి ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాజీద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌడవెల్లి గ్రామ పరిధిలోని కృషి హోం(అనాథాశ్రమం)లో వనపర్తి జిల్లా కుమ్మరిగిరికి చెందిన గణేశ్(15), నగరంలోని ఈసీఐఎల్‌కు చెందిన సన్నీ శామ్యూల్(11) ఉంటున్నారు. గణేశ్ 8వ తరగతి చదువుతుండగా, సన్నీ శామ్యూల్ 4వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఇద్దరు చిన్నారులు కృషి హోం నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో నిర్వాహకులు చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్లాటు కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు



మేడిపల్లి: తన భూమిని అక్రమంగా ఆక్రమించటానికి పీర్జాదిగూడ కో ఆప్షన్ మెంబర్ చిలుముల జగదీశ్వర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని ఉప్పల్‌కు చెందిన బన్నాల ప్రవీణ్, సోలిపురం ముత్యం రెడ్డిలు మేడిపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పీర్జాదిగూడ ము న్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ సాయిప్రియ నగర్ (సాలార్‌జంగ్ కంచె) రోడ్డు నెంబర్–1, ప్లాట్ నెంబర్–12లోని 200 గజాల స్థలాన్ని తన స్థలం అంటూ పీర్జాదిగూడ ము న్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పీర్జాదిగూడ కో ఆప్షన్ మెంబర్ చిలుముల జగదీశ్వర్‌రెడ్డి తన రాజకీయ పలుకుబడి, పార్టీ అండదండలతో తమ ను బెదిరిస్తూ కొంత మందితో తనపై దా డికి యత్నించారని తెలిపారు. మాకు ఈ స్థలంపై కోర్టు ఆర్డర్ స్టేటస్(కో) ఉందని చెప్పినా వినకుండా తమకు చెందిన ప్లాట్‌లోని చెట్లు, రాళ్లను జేసీబీతో చదును చేస్తున్నారని వారు పేర్కొన్నారు. సర్వే నంబర్‌లు 5, 8, 9లోని 200 చదరపు గజాల స్థలాన్ని 2004లో కొన్నామని, ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అతడి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలం సమీపిస్తున్నందున వచ్చే మూడు నెలలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్లకు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున ముందస్తుగా వర్షాకాల ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మ్యాన్‌హోల్స్, కంట్రోల్ రూమ్, నాలాల పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. నాలాల్లో పూడిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీలు అంతా క్లీన్‌గా ఉంచాలని తెలిపారు. డిజాస్టర్ టీములను రెడీగా ఉంచాలని, వారికి అవసరమైన బేసిక్ ఈక్విప్‌మెంట్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని మున్సిపల్ ఆదేశించారు. డ్రైనేజీ మూతలు ఓపెన్ చేయకూడదని, ఓపెన్ చేసి ఉన్న మూతలను బయటపెట్టకుండా వెంటనే మూసివేయాలన్నారు. ఎక్కడైనా మ్యాన్‌హోళ్లు, నాలాలు, ఓపెన్ చేసి ఉన్నచోట బ్యానర్ తయారు చేసి డేంజర్ బోర్డు అని తెలియజేసేలా సూచిక బోర్డు పెట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి జీహెచ్ఎంసీకి అనుసంధానంగా కనెక్షన్ ఇవ్వాలన్నారు. చెరువులు ఉన్నచోట ఎఫ్‌టీఎల్ బౌండరీ ఏర్పాటు చేసి, పిల్లర్లు కట్టి పెయింట్ వేయాలన్నారు. ప్రతిరోజూ మున్సిపల్ కమిషనర్లు తనిఖీలు చేపట్టాలన్నారు. డిజాస్టర్ టీమ్‌లను అలర్ట్‌గా ఉంచాలని కోరారు. వర్షాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని, అందువల్ల వర్షం నీరు రోడ్లమీద పడగానే వెళ్లే విధంగా మ్యాన్‌హోల్‌లో ఉన్న చెత్తను తొలగించాలని తెలిపారు. ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటుతో వర్షాకాల సమస్యను అధిగమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ప్లేటు ఫిరాయిస్తే.. కఠిన చర్యలు..

- ప్లేటుపై నంబర్లు స్పష్టంగా కనిపించాలి
- ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే ఊరుకోం..
- అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్: వాహనాలపై ఉన్న నంబర్ ప్లేట్‌లోని నంబర్లు కనబడకుండా చేస్తే వాహనదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్‌లో నంబర్లు కనబడకుండా రకరకాలుగా మార్చడం, ప్లేట్లపై స్టిక్కర్లు వేయడం, ప్లేట్ కనబడకుండా వంచడం వంటి పనులు చేస్తూ నిబంధనలు ఉల్లంగిస్తూ యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారని అన్నారు. ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు అలాంటి వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించినా వారు మారడం లేదని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. రూల్స్ పాటించకుండా ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వాహనదారులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తూనే చలాన్లు, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మేడ్చల్‌లో ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి అన్ని రకాల వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

## బడిబాటను విజయవంతం చేయాలి



సమావేశంలో ఎంపీడీఓ గ్యామనాయక్, ఎంఈఓ శశిధర్ తదితరులు

కీసర: బడిబాటను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ గ్యామనాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ శశిధర్‌తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాటను విజయవంతం చేసేందుకు మండల స్థాయి బడిబాట కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీఓ, ఎంఈఓ, తహసీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతి గ్రామంలో బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే విధంగా పిల్లల తల్లిదండ్రులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మూడుచింతలపల్లి విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శామీర్‌పేట్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని మేడ్చల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ఏడీఏ వెంకట్రామ్‌రెడ్డి హెచ్చరించారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. పంటలు పూర్తయ్యే వరకు బిల్లులు, విత్తనాల సంచులను భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ యాదగిరి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేష్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల సంబురాలు



ఘట్‌కేసర్: కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ ఆధ్వర్యంలో హ్యాట్రిక్ సంబురాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్ టెర్మినల్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్, మండల ప్రధాన కార్యదర్శులు, రామతీర్థ, శ్రీశైలం, ప్రభంజన్, నాయకులు రామోజీ, రమేశ్‌పెరిక, మధు, మహిపాల్‌రెడ్డి, శ్రీరాములు, కరుణాకర్, నరేశ్ ముదిరాజ్, సిద్ధిరాజ్, వీరేశం, కిశోర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, సుభాషిణి, సుమిత్, పవన్, శ్రీను, ప్రవీణ్, సరేంద్ర, మాధవి, సిద్ధు, ఉదయ్, కరుణాకర్‌యాదవ్, శోభన్‌బాబు, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.